జాబ్ స్కిల్స్ - 2024



**ఆ రహస్యాన్ని ఛేదిస్తే ఉద్యోగ చదరంగంలో రాజును చేస్తుంది. చేతకాక తలపట్టుకుంటే బంటుగానూ తగవంటుంది. అందుకుంటే అందలం ఎక్కించి, అందుకో లేకపోతే అక్కడే ఉండమంటుంది. కంప్యూటర్ లోకాన్ని శాసిస్తున్న ఆ నైపుణ్యం పేరు కోడింగ్. కంప్యూటర్ సామ్రాజ్యంలో సాఫ్ట్‌వేర్ క్షేత్రాలను ఏలాలంటే తప్పక ఎక్కవలసిన మెట్టు ఇది. ఒక్కోమెట్టు ఎక్కుతూ పైకి చూస్తుంటే ఇంకా ఎక్కవలసిన మెట్లు ఆకాశం వరకు కనిపిస్తుంటాయి. ఎక్కిన మెట్టు లోతును బట్టీ, దక్కిన సామర్థ్యాన్ని బట్టీ ఏడాదికి లక్ష నుంచి కోటి రూపాయిల వరకు వేతనాన్నిచ్చే వరప్రదాయిని కోడింగ్.**

# కోడ్ కూస్తే కొలువే!

మనకేం కావాలో కంప్యూటర్‌కు చెప్పే వారధి కోడింగ్. ఇది మన భావాలనూ, భాషనూ కంప్యూటర్‌కు చేర్చి అద్భుత ఫలితాలను రాబట్టే సామర్థ్యం. కోడింగ్ సామర్థ్యం దిగంతాలను కలిపే మహాసాగరం. ఎవరినైనా... ఏ విద్యానేపథ్యంతో వచ్చేవారినైనా కోడింగ్ సహస్ర బాహువులతో స్వాగతిస్తుంది. అయితే ఈ జలధిలో అడుగు పెట్టాలంటే కొన్ని కనీస నైపుణ్యాలుండాలి.

- గణితంపై కనీస అవగాహన అవసరం. గణాంకాలను చూస్తే నీరుకారిపోవడం కాక ఉత్సాహపడే స్వభావం ఉండాలి. మ్యాథ్స్ చూస్తే మైమరచి కాలాన్ని లెక్కచేయకుండా సమస్యల డొక్కచించగల హుషారుంటే మరీ మంచిది. అంకెల గమనాన్ని అర్థం చేసుకొని వాటివెంట పరుగెత్తగల సత్తా ఉన్నా చాలు.
- కోడింగ్ వైపు చూడాలంటే ఉండాల్సిన మరో లక్షణం- అంకెలు, సంఖ్యలను నిర్లిప్తంగా, నిస్తేజంగా చూడటం కాకుండా వాటి అమరిక వెనుక ఉన్న తార్కికతను పసిగట్టగలగాలి. 1, 2, 4, 8, 16, 32, 64, 128 ఈ వరుసను చూస్తే తెలిసిన అంకెలే కదా అనిపిస్తుంది. అయితే వీటిని యథాలాపంగా పేర్చుకుంటూ వెళ్లలేదు. ఒక అంకె నుంచి మరొక అంకె మధ్య ప్రయాణంలో ఒక లాజిక్ దాగి ఉంది. ప్రతి రెండు అంకెల మధ్య రెట్టింపు బలం పెరిగింది. ఈ అంకెల వరుస చూసీ చూడగానే వీటి వెనుక ప్రాతిపదిక తట్టినవారికే తార్కికంగా చూసే దృష్టి ఉన్నట్టు. ఈ లక్షణాలుంటే కోడింగ్ దిశగా అడుగులు వేయవచ్చు. ఈ కెరియర్ వైపు దృష్టి పెట్టవచ్చు.

### అనుసంధాన సంకేత భాష

ఒక ఉద్యోగం లేదా వృత్తిలో ఏం చేయాలో తెలుసుకుంటే ఏవిధమైన నైపుణ్యాలు సముపార్జించాలో తెలుస్తుంది. మనకూ కంప్యూటర్‌కూ మధ్య అనుసంధాన సంకేత భాషే కోడింగ్. మరయితే కోడింగ్‌లోకి అడుగుపెట్టినవారు ఏం చేయాలి?

- మనకూ, కంప్యూటర్‌కూ మధ్య వారధిగా ఉపయోగపడేది బైనరీ సంకేత భాష. స్థూలంగా చెప్పాలంటే అంకెలలోని 0-1లను ఉపయోగిస్తూ వ్యక్తీకరించే గణిత పదభాష. డిజిటల్ సాంకేతికతకు మూలధాతువు.
- కావలసిన ఫలితాన్ని (టాస్క్) రాబట్టేందుకు గణిత భాషలో కొన్ని జతల ఆజ్ఞల (కమాండ్స్) రూపంలో ఇచ్చి సిస్టమ్‌ను ఆ దిశగా పనిచేయించి ఫలితాన్ని సాధించడాన్నే కోడింగ్ స్క్రిప్ట్ రాయడం అంటారు.

### క్లుప్తంగా సాఫ్ట్‌వేర్ రూపొందించడం

- వెబ్‌సైట్స్, మనం విస్తృతంగా వినియోగిస్తున్న మొబైల్ అప్లికేషన్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్ వెనుక మౌనంగా, అవిశ్రాంతంగా పనిచేసేది కోడింగే. మనం ఓ చాయ్ తాగి పది రూపాయిలు మొబైల్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయడం వెనుక పనిచేస్తున్నది నిర్దిష్ట ఆదేశాలతో రూపొందించిన కోడింగే.

ఇంతకీ కోడర్ చేయవలసిందేమిటి? అంటే కొత్తగా సాంకేతిక భాషలో కోడ్ రాయడంగానీ లేదా అప్పటికే రాసి ఉన్న కోడ్‌లో మార్పులు చేర్పులు చేయడంగానీ, కోడ్‌ను అన్ని కోణాలనుంచి ఆశించిన ఫలితాలు ఇస్తుందా అని పరీక్షించడం (టెస్టింగ్) గానీ చేయాలి. ఇవి కనీస బాధ్యతలయితే, విస్తృత ప్రయోజనం కలుగజేసే, విస్తృతంగా వినియోగించే పది కాలాల పాటు నిలబడే కోడింగ్ స్క్రిప్ట్‌ను అతి తక్కువ ఆదేశాల కమాండ్స్‌తో రాయగలిగే ఉద్యోగార్థిని కంపెనీలు నెత్తిన పెట్టుకుంటాయి. కళ్లు చెదిరే ప్యాకేజీలు ఇచ్చేది ఇటువంటి కోడింగ్ జాతిరత్నాలకే!

### పెరుగుదల ఏ రీతిలో?

నాస్కామ్ గణాంకాల ప్రకారం 2020 నాటికే దేశంలో 44 లక్షల మంది ఐటీ, ఐటీ ఆధారిత సేవారంగంలో పనిచేస్తున్నారు. ఈ సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. అయితే, ఇక్కడ మనం గుర్తించాల్సింది - కోడింగ్ ఆధారిత పొజిషన్లు ఏటా ఏమేరకు పెరుగుతున్నాయన్నది.

- కంప్యూటర్ రిసెర్చ్ సైంటిస్ట్ –15%
- వెబ్ డెవలపర్– 11%
- కంప్యూటర్ సిస్టమ్స్ అనలిస్ట్– 7%
- నెట్‌వర్క్ ఆర్కిటెక్ట్– 5%
- డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్– 4%

అంటే ఈమేరకు ఉద్యోగావకాశాలు ఆహ్వానం పలుకుతున్నాయి. ఫ్రెషర్స్ పొజిషన్లలో దేనికి తమ నైపుణ్యం నప్పుతుందో, ఏది తమకు ఆసక్తిదాయకంగా ఉంటుందో ఆ సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు.

### కోడింగ్ ఆధారిత ఉద్యోగాలేమిటి?

కోడింగ్ స్క్రిప్ట్ రాసేవారిని సాఫ్ట్‌వేర్ నిపుణులుగా పేర్కొంటున్నప్పటికీ ఇందులో నాలుగైదు రకాల వేర్వేరు హోదాలున్నాయి. నైపుణ్యాన్ని బట్టి హోదా, హోదాను బట్టి వేతనాలుంటాయి.

**కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ రిసెర్చ్ సైంటిస్ట్:** ఈ కోవలో అగ్రభాగాన నిలిచే కొలువు ఇది. వ్యాపార, వాణిజ్యాల్లో సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించగలిగేలా కోడింగ్ సవరణ/ సరికొత్త సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేసేవారిని ఈ హోదా వరిస్తుంది. తొలుత లభ్యమయ్యే పుష్కలమైన సమాచారాన్ని శోధించి ఆపై వ్యాపారాభివృద్ధికి దోహదం చేయగల కోడింగ్‌ను రచించగలిగే సామర్థ్యం అత్యుత్తమమైనది. ఉదాహరణకు దేశవ్యాప్తంగా వందలాది రిటైల్ స్టోర్స్ ఉన్న కంపెనీ లక్షలాది వినియోగదారుల వస్తు విక్రయ సమాచారాన్ని సూక్ష్మ పరిశీలన చేసి వారి ద్వారా కంపెనీ కొత్త ఉత్పత్తులను కొనిపించే ఆఫర్లు సృష్టించగల సాఫ్ట్‌వేర్. దీన్ని రూపొందించే నిపుణునికి ఎంత విలువ ఉంటుందో చెప్పనవసరంలేదు.

**వెబ్ డెవలపర్:** కోడింగ్ అంతర్లీనంగా ఉండే మరో హోదా ఇది. ప్రతి వ్యాపార, ప్రజా అవసరానికి వెబ్‌సైట్ అవసరమవుతున్న నేటి తరుణంలో వెబ్‌సైట్ రూపకల్పన గొప్ప సామర్థ్యం అనిపించుకోదు. వెబ్‌సైట్‌ను దర్శించే వినియోగదారునికి సౌకర్యవంతంగా ఉండేలా, పండిత- పామరులు వినియోగించుకునే వెసులుబాటుతో వెబ్‌సైట్ చేయడం వెనుక కోడింగ్ నైపుణ్యం ఇమిడి ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌పై ఎంతగా పట్టుంటే అంత సులభతరంగా ఉండేలా వెబ్‌సైట్ చేయగలుగుతారు.

**నెట్‌వర్క్ ఆర్కిటెక్ట్:** భారీ సంస్థల్లో, బహుళ ప్రదేశాల్లో కార్యకలాపాలు నిర్వహించే సంస్థల్లో కంప్యూటర్ల వ్యవస్థ



సంక్లిష్టంగా ఉంటుంది. వీటన్నింటినీ అనుసంధానిస్తూ, నియంత్రిస్తూ సంస్థ లక్ష్యాల దిశగా నడిపే నిపుణులే నెట్‌వర్క్ ఆర్కిటెక్ట్స్. విభిన్న నెట్‌వర్క్‌ను సంస్థ పనితీరుకు తగ్గట్టు ప్రోగ్రామింగ్ రూపకల్పన, అవసరమైనప్పుడు మార్పులు చేర్పులు, సైబర్ సెక్యూరిటీ లాంటి బాధ్యతలు మోసే వీరికి మంచి డిమాండ్ ఉంది.

**కంప్యూటర్ సిస్టమ్స్ అనలిస్ట్:** ప్రతి కంపెనీలో ఐటీ ప్రొఫెషనల్స్, నాన్-ఐటీ ప్రొఫెషనల్స్ ఉంటారు. వీరిమధ్య సయోధ్య వాతావరణం కుదిర్చి వారధిగా వ్యవహరించేవారే కంప్యూటర్ సిస్టమ్స్ అనలిస్ట్స్. సంస్థకు కావలసిన సరైన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎంపిక, అమలు, తగిన హార్డ్‌వేర్ ఏర్పాటు చేసి వ్యాపారపరంగా ఎదురయ్యే సవాళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించగల సామర్థ్యం ఉన్నవారిని ఈ పొజిషన్‌లో నియమిస్తారు.

**డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్:** సమాచారమే సంపద సృష్టికి దారితీస్తున్న నేపథ్యంలో డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లకు కంపెనీలు విలువ ఇస్తున్నాయి. సమాచార సేకరణ, నిర్వహణ, డేటా భద్రత డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్ల బాధ్యత. డేటా పరిరక్షణ, అవసరమైనప్పుడు సకాలంలో డేటాను అందుబాటులోకి తీసుకురావడం డి.బి.ఎ.ల కెరియర్‌ను ఉజ్వలం చేస్తున్నాయి.

### మెరుగుపరచుకునేదెలా?

**1** స్వతస్సిద్ధంగా ఉండాల్సిన తార్కిక ఆలోచనా దృక్పథం, గణిత పరిజ్ఞానం, ఆసక్తి ఉంటే కోడింగ్‌ను నేర్చుకునేందుకు కొన్ని టెక్నాలజీ వేదికలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కొన్ని ఇప్పటికే కాస్త నైపుణ్యం ఉండీ మెరుగుపరచుకునేందుకు దోహదపడేవి. మరికొన్ని కోడింగ్‌ను మొదటిమెట్టు నుంచీ నేర్పేవి.

**2** గీక్స్ ఫర్ గీక్స్, లీట్‌కోడ్, హ్యాకర్ ర్యాంక్, కోడ్ షెఫ్, కోడ్ ఫోర్సెస్ వంటి సాంకేతిక వేదికలు కోడింగ్ నైపుణ్యాలకు మెంటర్లలా ఉపయోగపడతాయి. కోడ్ టెస్టింగ్, కోడింగ్ చేసిన నమూనాను మెరుగుపర్చడం తదితర సామర్థ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పిస్తాయి. దీనితోపాటు ఐటీ ప్లేస్‌మెంట్స్‌లో టెక్నికల్ రౌండ్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు సూచనలు అందిస్తాయి.

**3** ఇప్పటికే కోడింగ్‌లో పట్టు తెచ్చుకున్న ఉద్యోగార్థులు తమ సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకూ, కోడింగ్‌లో జాతీయస్థాయిలో తమ స్థాయి తెలుసుకునేందుకూ పోటీలు నిర్వహించే సాంకేతిక వేదికలు- కోడ్ షెఫ్, కోడ్ ఫోర్సెస్. ఇవి నిర్వహించే పోటీల్లో పాల్గొనడంవల్ల ఉద్యోగార్థి తన స్థాయిని గుర్తించి ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవచ్చు.

**4** కోడింగ్‌లో ప్రతిష్ఠాత్మక సంస్థలు నిర్వహించే పోటీల్లో పాల్గొనడంవల్ల మరొక ప్రయోజనం ఉంది. ఈ సంస్థలు ప్రకటించే మెరిట్ జాబితా ఆధారంగా కొన్ని కంపెనీలు ప్లేస్‌మెంట్స్‌కి కూర్చున్నప్పుడు తన కోడింగ్ క్రెడిట్‌ను రెజ్యూమెలో పేర్కొనవచ్చు. ఇంకా కోడింగ్ టెస్ట్‌లో అగ్రభాగాన నిలిస్తే ఆ సంస్థలు ప్రకటించిన నగదు బహుమతినీ అందుకోవచ్చు.

**5** కోడింగ్ అనేది ఒక సాంకేతిక నైపుణ్యంగా కనిపిస్తున్నప్పటికీ ఇదొక ఆలోచనా సరళి. ఒక విషయాన్ని లోతుగా ఆలోచించడం, కళ్లకు కనిపిస్తున్న వాటి వెనుక నిక్షిప్తమైన తార్కిక ప్రాతిపదికను గుర్తించగలగడం, సమస్యా పరిష్కారం... ఇవన్నీ ఉన్న ఉద్యోగార్థులు కోడింగ్ సామర్థ్యాన్ని వేగంగా అందిపుచ్చుకోగలుగుతారు.

దీంతో పాటు కోడింగ్ నైపుణ్యంలో ఉన్నతస్థాయికి చేరి ఎంతటి సంక్లిష్ట పరిస్థితులనయినా ఛేదించి ఐటీ ప్రొఫెషనల్ జాబ్ సాధించాలంటే నిర్దిష్ట సూత్రాలు గ్రహించాలి. కోడింగ్‌లో ఇమిడి ఉన్న సవాళ్లను తెలుసుకోవాలి. అప్పుడే ఎలాంటి కొలువైనా సులువుగా దక్కుతుంది!



– యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

## దేన్ని ఎంచుకోను?

**ఇంటర్మీడియట్ (ఎంపీసీ) పరీక్షలు రాశాను. ఇంజినీరింగ్ చేయాలని లేదు. కంప్యూటర్ నాలెడ్జ్ పెంచుకోడానికి బీఎస్సీ కంప్యూటర్స్, బీసీఏల్లో ఏది మెరుగు? బీసీఏకి భవిష్యత్తు ఉందా? - వేదప్రకాశ్**

■ కంప్యూటర్ రంగంలో పరిజ్ఞానం పెంపొందించుకోవాలనుకుంటే బీఎస్సీ కానీ, బీసీఏ కానీ, బీకాం (కంప్యూటర్స్) కానీ చదవొచ్చు. బీఎస్సీలో కంప్యూటర్ కోర్సును మ్యాథ్స్/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ స్టాటిస్టిక్స్ లాంటి మరో రెండు సబ్జెక్టులతో కలిపి చదువుతారు. బీకాంలో కామర్స్ సబ్జెక్టులతో పాటు కంప్యూటర్స్ కూడా చదువు



తారు. బీసీఏలో అయితే మూడు సంవత్సరాల పాటు కంప్యూటర్స్ సంబంధిత కోర్సులు మాత్రమే చదువుతారు. కాబట్టి బీసీఏ చదివినవారికి కంప్యూటర్స్/ సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ రెండు ప్రోగ్రాంల భవిష్యత్తు విషయానికొస్తే బీఎస్సీ (కంప్యూటర్స్) డిగ్రీతో వెంటనే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు తక్కువ. ఆ తరువాత ఎంసీఏ కానీ, ఎమ్మెస్సీ (కంప్యూటర్స్/ డేటా సైన్స్) కానీ చేయాలి. బీసీఏ చదివితే మీ నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం ఆధారంగా వెంటనే ఉద్యోగం వచ్చే అవకాశాలుంటాయి.

బీఎస్సీ చదివినా, బీసీఏ చదివినా, ఎంసీఏ, ఎంబీఏ - జనరల్, ఎంబీఏ - బిజినెస్ అనలిటిక్స్ లాంటి కోర్సుల్లో చేరవచ్చు. మీ దీర్ఘకాలిక ఆశయాలను దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి. బీటెక్ - కంప్యూటర్ సైన్స్ చదివేవారి సంఖ్య ఎక్కువ అవ్వడం వల్ల బీసీఏ ప్రోగ్రాంకు కొంత ఆదరణ తగ్గింది. అయినప్పటికీ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు మెరుగుపరుచుకొంటే సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుంది. చివరిగా ప్రతి డిగ్రీకీ ఉద్యోగావకాశాలు బాగానే ఉంటాయి. కానీ ఉద్యోగం రావడం అనేది అభ్యర్థి ప్రతిభ, నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, సమస్యా పరిష్కార సామర్థ్యం, భావప్రకటన లాంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### మేఘాలయలో వివిధ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేఘాలయ - శాశ్వత ప్రాతిపదికన 6 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
★ టెక్నికల్ అసిస్టెంట్ ★ టెక్నీషియన్
★ సూపరింటెండెంట్ ★ జూనియర్ అసిస్టెంట్
**అర్హతలు:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ, బీటెక్, ఎంసీఏ, మాస్టర్ డిగ్రీ, సీనియర్ సెకండరీ (10+2)తో పాటు పని అనుభవం. **దరఖాస్తు రుసుము:** రూ.200 **దరఖాస్తుకు చివరి తేదీ:** 30-04-2024 **వెబ్‌సైట్:** https://www.nitm.ac.in/recruitment

#### ఎన్ఐటీ కురుక్షేత్రలో ఫ్యాకల్టీ

కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)... వివిధ విభాగాల్లో 77 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
★ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-II ★ అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-I
★ అసోసియేట్ ప్రొఫెసర్
**విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తదితరాలు.
**అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు బోధన/ పరిశోధన అనుభవం. **ఎంపిక:** రాత పరీక్ష, ప్రజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా. **దరఖాస్తు రుసుము:** రూ.2000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.1000.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 25-04-2024.
**దరఖాస్తు హార్డ్ కాపీ స్వీకరణకు చివరి తేదీ:** 30.04.2024.
**వెబ్‌సైట్:** https://nitkkr.ac.in/jobs-nit-kkr/

### ప్రవేశాలు

#### ఏపీ లాసెట్/ పీజీఎల్‌సెట్-2024

ఆంధ్రప్రదేశ్ లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ లాసెట్)/ పోస్ట్ గ్రాడ్యుయేట్ లాసెట్ (ఏపీ పీజీఎల్‌సెట్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షను గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించనుంది. ఈ ప్రకటన ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి ఏపీలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం/ ఎంఎల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు.
**కోర్సులు:** మూడేళ్లు/ ఐదేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం/ ఎంఎల్. **అర్హత:** కోర్సును అనుసరించి 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎల్ఎల్‌బీ, పీజీ.
**దరఖాస్తు ఫీజు:** ఎల్ఎల్‌బీ కోర్సుకు- ఓసీ అభ్యర్థులకు రూ.900. బీసీలకు 850. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.800. ఎల్ఎల్ఎం కోర్సుకు- ఓసీ అభ్యర్థులకు రూ.1000. బీసీలకు రూ.950. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.900.
**పరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఎల్ఎల్‌బీ కోర్సులకు పరీక్ష ఇంగ్లిష్, తెలుగు రెండు మాధ్యమాల్లో; ఎల్ఎల్ఎం పరీక్ష ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 25-04-2024
**దరఖాస్తుల సవరణ తేదీలు:** మే 30 నుంచి జూన్ 1 వరకు.
**హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 03-06-2024.
**ప్రవేశ పరీక్ష తేదీ:** 09-06-2024.
**వెబ్‌సైట్:**
https://cets.apsche.ap.gov.in/APSCHE/APSCHEHome.aspx

## తాజా ఇంటర్న్‌షిప్‌లు

### హైదరాబాద్‌లో

**డిజిటల్ మార్కెటింగ్**
సంస్థ: డాక్టర్ స్మార్ట్ నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, కంటెంట్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
☛ internshala.com/i/ba82d3

**ది అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్**

**1. వేర్‌హౌస్ ఆపరేషన్స్**
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, హిందీ, తెలుగు మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: నెలకు రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 4
☛ internshala.com/i/2a5555

**2. వేర్‌హౌస్ ప్యాకింగ్ అసిస్టెన్స్**
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం స్టైపెండ్: నెలకు రూ.10,000-12,000 దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
☛ internshala.com/i/e1bfa1

**బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)**
సంస్థ: బూట్‌స్ట్రాక్ నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సేల్స్, సేల్స్ పిచ్ స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
☛ internshala.com/i/757ed2

**క్వాలిటీ అనలిస్ట్**
సంస్థ: రిజల్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, క్వాలిటీ అస్యూరెన్స్ / క్వాలిటీ కంట్రోల్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
☛ internshala.com/i/52d3ae

**మార్కెటింగ్**
సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 9
☛ internshala.com/i/5a05e8

## నవోదయలో 1377 అవకాశాలు

**నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) 1377 బోధనేతర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ/ స్కిల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఉత్తీర్ణులైనవారిని కేంద్ర, ప్రాంతీయ ఎన్‌వీఎస్ కార్యాలయాల్లో నియమిస్తారు.**



పోస్టును బట్టి నియామక పోటీ పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్‌లలో ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. పోస్టులు... వాటి సంఖ్య.. ఇతర వివరాలు చూద్దాం.

**1. ఫిమేల్ స్టాఫ్‌నర్స్–121:** బీఎస్సీ (ఆనర్స్) ఇన్ నర్సింగ్ లేదా బీఎస్సీ నర్సింగ్ లేదా పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్. స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టరై ఉండాలి. 50 పడకల ఆసుపత్రిలో రెండున్నర ఏళ్లు పనిచేసిన అనుభవం అవసరం. హిందీ/ ప్రాంతీయ భాష, ఇంగ్లిష్‌లను అర్థం చేసుకుని పనిచేయగలగాలి.

**2. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్–5:** డిగ్రీ పాసవ్వాలి. అడ్మినిస్ట్రేటివ్, ఫైనాన్షియల్ విషయాల్లో మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

**3. ఆడిట్ అసిస్టెంట్–12:** బీకాం పాసై.. మూడేళ్ల అకౌంట్స్ అనుభవం అవసరం.

**4. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్–4:** హిందీలో మాస్టర్స్ డిగ్రీ.. ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలి. లేదా ఇంగ్లిష్‌లో మాస్టర్స్ డిగ్రీ.. హిందీ తప్పనిసరి సబ్జెక్టుగా చదవాలి. ఏ సబ్జెక్టుతోనైనా హిందీ మాధ్యమంలో పీజీ చేయాలి, ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టుగా ఉండాలి.

**5. లీగల్ అసిస్టెంట్–1:** లా డిగ్రీ పాసై.. లీగల్ కేసుల నిర్వహణలో మూడేళ్ల అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రావీణ్యం అవసరం. వయసు 23 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.

**6. స్టెనోగ్రాఫర్–23:** ఇంటర్మీడియట్ పాసై నిమిషానికి 80 పదాల వేగంతో డిక్టేషన్ తీసుకుని.. దాన్ని కంప్యూటర్ పైన ఇంగ్లిష్‌లో 50 నిమిషాలు, హిందీలో 65 నిమిషాల్లో ట్రాన్స్‌స్క్రిప్ట్ చేయగలగాలి. గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు.

**7. కంప్యూటర్ ఆపరేటర్–2:** బీసీఏ/ బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్/ఐటీ) పాసవ్వాలి. లేదా బీఈ/ బీటెక్ (కంప్యూటర్ సైన్స్/ఐటీ) పూర్తిచేయాలి. గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు.

**8. కేటరింగ్ సూపర్‌వైజర్–78:** హోటల్ మేనేజ్‌మెంట్‌లో బ్యాచిలర్ డిగ్రీ పాసవ్వాలి. గరిష్ఠ వయసు 35 ఏళ్లు. లేదా కేటరింగ్‌లో ట్రేడ్ ప్రొఫిషియన్సీ సర్టిఫికెట్ ఉండి పదేళ్ల అనుభవం అవసరం (ఈ అవకాశం ఎక్స్-సర్వీస్‌మెన్‌కు మాత్రమే)

**9. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్–381:** ఇంటర్మీడియట్ పాసై.. టైపింగ్ వేగం ఇంగ్లిష్‌లో నిమిషానికి 30 పదాలు లేదా హిందీలో 25 పదాలు ఉండాలి. లేదా సెక్రటేరియల్ ప్రాక్టీసెస్ అండ్ ఆఫీస్ మేనేజ్‌మెంట్ ఒకేషనల్ సబ్జెక్టులుగా స్టేట్ బోర్డ్ ఇంటర్మీడియట్ పాసవ్వాలి. 6 నెలల కంప్యూటర్ డిప్లొమా కోర్సు చేసి, అకౌంట్స్/ అడ్మినిస్ట్రేటివ్ విషయాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు.

**10. ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్–128:** పదో తరగతి పాసై, ఎలక్ట్రీషియన్/ వైర్‌మేన్ ఐటీఐ సర్టిఫికెట్ ఉండి.. ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్/ వైరింగ్/ ప్లంబింగ్‌లో రెండేళ్ల అనుభవం అవసరం..

**11. ల్యాబ్ అటెండెంట్–161:** పదో తరగతి పాసై ల్యాబొరేటరీ టెక్నిక్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా ఉండాలి. లేదా సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పాసవ్వాలి. గరిష్ఠ వయసు 30 ఏళ్లు.

**12. మెస్ హెల్పర్– 442:** పదో తరగతి పాసై, ఐదేళ్లు స్కూల్ మెస్‌లో పనిచేసిన అనుభవం అవసరం. నవోదయ విద్యా సమితి నిర్వహించే స్కిల్ టెస్ట్ పాసవ్వాలి. గరిష్ఠ వయసు 30.

**13. మల్టీ టాస్కింగ్ స్టాఫ్–19:** పదో తరగతి పాసవ్వాలి. గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు.

**వయసు:** పోస్టును బట్టి వయః పరిమితిలో తేడాలు ఉన్నాయి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు స్టాఫ్‌నర్స్ పోస్టుకు జనరల్/ ఈడబ్ల్యూఎస్/ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు రూ.1500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీలకు రూ.500. మిగతా అన్ని పోస్టులకూ జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు రూ.1000. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీలకు రూ.500.

**పరీక్ష కేంద్రాలు:** ఆంధ్రప్రదేశ్‌లో: విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, అనంతపురం.

తెలంగాణలో: హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్.

**దరఖాస్తుకు చివరి తేదీ:** 30.04.2024
**వెబ్‌సైట్:** www.navodaya.gov.in

### పరీక్ష ఎలా ఉంటుంది?

**స్టాఫ్‌నర్స్:** ప్రశ్నపత్రంలో 4 పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 120 ప్రశ్నలకు 120 మార్కులు. పార్ట్-1లో రీజనింగ్ ఎబిలిటీ 15 ప్రశ్నలు - 15 మార్కులు. పార్ట్-2లో జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ 15 ప్రశ్నలు - 15 మార్కులు. పార్ట్-3లో లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ అండ్ జనరల్ హిందీ ప్రతి సబ్జెక్టుకు 10 మార్కుల చొప్పున) 20 ప్రశ్నలకు - 20 మార్కులు. పార్ట్-4లో సబ్జెక్టు నాలెడ్జ్ 70 ప్రశ్నలకు - 70 మార్కులు.

**జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్:** స్టేజ్-1లో కాంపిటిటివ్ పరీక్ష, స్టేజ్-2లో టైపింగ్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రంలో 5 పార్టులు. పార్ట్-1లో మెంటల్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ 20 ప్రశ్నలకు 20 మార్కులు. పార్ట్-2లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలకు-20 మార్కులు. పార్ట్-3లో జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలకు - 30 మార్కులు. పార్ట్-4లో లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ 30 ప్రశ్నలకు - 30 మార్కులు. పార్ట్-5లో బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ కంప్యూటర్ ఆపరేషన్ 30 ప్రశ్నలకు- 30 మార్కులు. మొత్తం 130 ప్రశ్నలకు - 130 మార్కులు.

**ల్యాబ్ అటెండెంట్:** ప్రశ్నపత్రం 120 మార్కులకు ఉంటుంది. పార్ట్-1లో రీజనింగ్ ఎబిలిటీ 15 ప్రశ్నలకు 15 మార్కులు. పార్ట్-2లో జనరల్ అవేర్‌నెస్ 15 ప్రశ్నలకు 15 మార్కులు. పార్ట్-3లో లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ 30 ప్రశ్నలకు 30 మార్కులు. పార్ట్-4లో సబ్జెక్ట్ స్పెసిఫిక్ నాలెడ్జ్ 60 ప్రశ్నలకు 60 మార్కులు.

**మెస్ హెల్పర్:** ప్రశ్నపత్రంలో 4 పార్టులు. పార్ట్-1లో రీజనింగ్ ఎబిలిటీ 15 ప్రశ్నలకు 15 మార్కులు. పార్ట్-2లో జనరల్ అవేర్‌నెస్ 15 ప్రశ్నలకు 15 మార్కులు. పార్ట్-3లో లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ 20 ప్రశ్నలకు 20 మార్కులు. పార్ట్-4లో సబ్జెక్ట్ స్పెసిఫిక్ నాలెడ్జ్ (ఫుడ్, న్యూట్రిషన్, హైజీన్, ఇండియన్ ఫుడ్ అండ్ స్వీట్స్ రెసిపీస్) 70 ప్రశ్నలకు 70 మార్కులు. మొత్తం 120 ప్రశ్నలకు 120 మార్కులు.

☞ పై నాలుగు పరీక్షలకు వ్యవధి 2.5 గంటలు.

**మల్టీటాస్కింగ్ స్టాఫ్:** ప్రశ్నపత్రంలో మూడు పార్టులు ఉంటాయి పార్ట్-1లో లాంగ్వేజ్ టెస్ట్ 40 ప్రశ్నలు, 40 మార్కులు. పార్ట్-2లో జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు, 20 మార్కులు, పార్ట్-3లో బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ కంప్యూటర్ ఆపరేషన్ 40 ప్రశ్నలు 40 మార్కులు. మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులు. వ్యవధి 2 గంటలు.